క్లుప్తంగా

తుడా ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు అందిస్తున్న కృష్ణారెడ్డి

తిరుపతి తుడా : తాతయ్య గంగమ్మ జాతరకు విచ్చేసిన భక్తులకు మంగళవారం తుడా ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు 2 వేల మంది భక్తులకు తుడా సెక్రటరీ కృష్ణారెడ్డి మజ్జిగ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో సీపీఓ దేవి కుమారి, ఎల్‌ఏఓ సుజన, ఏఏఓ సుగుణ, మాలతి, డీఈఈ బాషా పాల్గొన్నారు.

ఆఫీసర్స్ క్లబ్ మజ్జిగ పంపిణీ


మజ్జిగ అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట జాతర సందర్భంగా ఆఫీసర్స్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

నేడు ఎంబీయూలో అచీవర్స్ డే

చంద్రగిరి : మోహన్‌బాబు విశ్వవిద్యాలయం (ఎంబీయూ)లో అచీవర్స్‌డే–2025ను బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వర్సిటీ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంబీయూ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి 2024–25 విద్యా సంవత్సరంలో ప్లేస్‌మెంట్స్ సాధించిన సుమారు 1,600 మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలసి పాల్గొననున్నట్లు వెల్లడించారు. ముఖ్య అతిథులుగా ఎంబీయూ చాన్సలర్ మోహన్‌బాబు, ప్రో చాన్సలర్ మంచు విష్ణు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి హాజరుకానున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులతో పాటు తల్లిదండ్రులను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు.

గ్రామ దేవతలకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో సత్యమ్మతల్లి

పాకాల : మండలంలోని పలు ఆలయాల్లో గ్రామ దేవతలకు ఘనంగా పూజలు నిర్వహించారు. మంగళవారం గంగ జాతర పాకాలలోని సత్యమ్మ ఆలయంలో, భారతంమిట్టలోని విరూపాక్షమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అంబలిని నైవేద్యంగా సమర్పించారు.సత్యమ్మ ఆలయంలో ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేశారు. సాయంత్రం పొంగళ్లు పొంగించి భక్తులకు పంచిపెట్టారు.

సైనికుల కోసం రూ.10 లక్షల వితరణ

– ఉదారత చాటుకున్న కేవీఆర్ జ్యువెలరీ


ఎన్‌డీఎఫ్‌కు అందించిన ఆర్థిక సాయం పత్రాలను చూపుతున్న దాత నారాయణమూర్తి

తిరుపతి కల్చరల్ : భారత్– పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో దేశం కోసం ప్రాణాలు తెగించి పోరాడుతున్న భారత సైనికుల సౌకర్యార్థం కేవీఆర్ జ్యువెలరీ షోరూం అధినేత కేవీఆర్ నారాయణమూర్తి మంగళవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. ఈ విరాళం సొమ్మును నేషనల్ డిఫెన్స్ ఫండ్స్‌కు ఆన్‌లైన్ ద్వారా అందించి ఉదారత చాటుకున్నారు. నారాయణమూర్తికి దేశభక్తికి ఆయన సతీమణి స్వర్ణ గౌరి, కుమారుడు రామకృష్ణ, కోడలు విజయలక్ష్మి, మరో కుమారుడు శ్రీనివాస్ తమ సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్ పాల్గొన్నారు.

తొక్కుకుంటూ.. తోసుకుంటూ..!



- మారని అధికారుల తీరు
- జాతరలో భక్తుల బేజారు



శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి మంగళవారం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధికారులు, ఆలయ నిర్వాహకుల అలసత్వంతో నానా అవస్థలు పడ్డారు. సక్రమంగా క్యూలు ఏర్పాటు చేయకపోవడంతో తొక్కుకుంటూ.. తోసుకుంటూ తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత అనుభవాలను గుర్తుతెచ్చుకుని ఆందోళన చెందారు. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు కన్నీటిపర్యంతమయ్యారు. కొందరు బతుకుజీవుడా అనుకుంటూ అమ్మవారి దర్శనానికి సైతం వెళ్లకుండా తిరుగుముఖం పట్టారు. తిరుపతి ప్రతిష్టకు ప్రతీకగా నిలిచే గంగ జాతరను నిర్లక్ష్యంగా నిర్వహించడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. – తిరుపతి కల్చరల్






అదరక.. బెదరక ఆరోహణ!

సాహసం మా పథం.. ధైర్యమే ఆయుధం అంటూ ఎన్‌సీసీ క్యాడెట్లు సత్తా చాటారు. ముష్కరమూక వికటాట్టహాసాలు వినిపిస్తున్నా.. లక్ష్యసాధనే ధ్యేయంగా ముందుకు సాగారు. ఉగ్రదాడి ప్రకంపనలకు ఏమాత్రం వెరవకుండా శిఖరాలను అధిరోహించారు. తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ విద్యార్థులు ట్రెక్కింగ్ ట్రైనింగ్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచారు. అదే సమయంలో తమ క్యాంపు సమీపంలోనే టెర్రరిస్టులు కాల్పులకు తెగబడినా అదరక.. బెదరక.. పర్వతారోహణ పూర్తి చేశారు.


ట్రెక్కింగ్‌లో వెటర్నరీ విద్యార్థులు

- సాహసమే శ్వాసగా సాగిన శిక్షణ
- ఉగ్రదాడి సమయంలో పెహల్గామ్‌లోనే ఎన్‌సీసీ క్యాడెట్లు
- క్యాంపునకు సమీపంలోనే టెర్రరిస్ట్ కాల్పులు
- పట్టించుకోకుండా ట్రెక్కింగ్ ట్రైనింగ్ పూర్తి చేసిన వెటర్నరీ విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎన్‌సీసీ క్యాడెట్ల పర్వతారోహణ శిక్షణలో భాగంగా తిరుపతి 2ఏ ఆర్ అండ్ వీ ఎన్‌సీసీ రెజిమెంట్ పరిధిలో వెటర్నరీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రెక్కింగ్‌కు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 18 నుంచి ఈనెల 2వ తేదీ వరకు జమ్మూ కశ్మీర్ సనాసర్‌లోని పహల్గామ్ అడ్వెంచర్ క్యాంప్‌లో శిక్షణ పొందారు. ప్రతిష్టాత్మక జవహర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ శిక్షణ తీసుకున్నారు. పర్వతారోహణ చేస్తున్న సమయంలో పహల్గామ్‌లో యాత్రికులను, పౌరులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడి చేశారు. అయినప్పటికీ ఎటువంటి భయం లేకుండా వారు యాత్రను కొనసాగించారు. క్షేమంగా తిరుపతికి చేరుకున్నారు. వెటర్నరీ కళాశాల అధికారులు, ఎన్‌సీసీ అధికారులు వారి ధైర్య సాహసాలకు అభినందనలు తెలిపారు

సమీపంలోనే ఉగ్రదాడి

ఎన్‌సీసీ క్యాడెట్లు శిక్షణ తీసుకుంటున్న పర్వత ప్రాంతాలకు సమీపంలోనే ఉగ్రదాడి జరగడం విశేషం. దీంతో అధికారులు శిక్షణకు వెళ్లిన తిరుపతికి చెందిన వెటర్నరీ విద్యార్థులను అప్రమత్తం చేశారు. దేశం మొత్తం ఉగ్రదాడిపై చర్చించుకుంటున్నా, అదే ప్రాంతంలో ఉన్న ఆర్మీ అధికారులు విద్యార్థులలో ఆత్మస్థైర్యం నింపారు. దీంతో విద్యార్థులు శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసి ఈనెల 8వ తేదీన తిరుపతికి చేరుకున్నారు.

వెన్నుతట్టి ధైర్యం నింపారు



పెహల్గామ్‌లో సమీపంలోని పర్వత శిఖరాలలో మాకు ట్రెక్కింగ్ శిక్షణ ఇచ్చారు. ఉగ్రదాడి జరిగిన ప్రాంతానికి దగ్గరలోనే ట్రెక్కింగ్ చేస్తున్నాం. కొండ శిఖరాలపై టెంట్‌లను ఏర్పాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యాం. ఒక్క సారిగా కాల్పుల వార్త వినగానే కాస్త అయోమయానికిలోనయ్యాం. అయితే ట్రెక్కింగ్ శిక్షకులు, ఆర్మీ అధికారులు వెన్నుతట్టి ధైర్యం నింపారు. ఎన్‌సీసీ అంటేనే దేశభక్తి, క్రమశిక్షణకు మారు పేరు. దీంతో భయం మా దరిచేరలేదు. మళ్లీ ట్రెక్కింగ్ ప్రారంభించి శిక్షణను పూర్తి చేసుకున్నాం.

– వై.దుర్గాప్రసాద్, డి.గౌరి, ఓ.భవితశ్రీ, ఎన్‌సీసీ క్యాడెట్లు

'సీబీఎస్‌ఈ' ఫలితాల్లో విద్యాసుమాలు


సాయి హర్ష, తేజస్


హేమ స్వరూప్, పోగూరి వికాస్, భావజ్ఞ

తిరుపతి రూరల్ : సీబీఎస్‌ఈ గ్రేడ్ 10, గ్రేడ్ 12 ఫలితాలలో తిరుపతి ఎడిఫై విద్యార్థులు సత్తా చాటారు. వంద శాతం ఉతీర్ణత సాధించారు. గ్రేడ్ 10లో జి.సాయిహర్ష 500మార్కులకు గాను 494 మార్కులు, గ్రేడ్ 12 ఎంపీసీలో తేజస్ 500 మార్కులకు గాను 482 మార్కులు సాధించారు. ఈమేరకు ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎడిఫై స్కూల్ డైరక్టర్ ప్రణీత అభినందించారు.

'లిటిల్ ఏంజెల్స్' ప్రభంజనం

తిరుపతి సిటీ : సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాలలో లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. హేమ స్వరూప్ 500 మార్కులకు 492, పోగూరి వికాస్ 489, భావజ్ఞ 488 సాధించి స్కూలు టాపర్లుగా నిలిచారు. కరస్పాండెంట్ కె.రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. స్కూల్ టాపర్లను డైరెక్టర్, చైర్ పర్సన్ డాక్టర్ శ్వేత, రమాదేవి అభినందించారు.

'విద్యాభవన్' ప్రతిభ


ఆవుల కీర్తికారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: సీబీఎస్‌ఈ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భారతీయ విద్యా భవన్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అక్కంశెట్టి ఎస్వీఎస్ శ్రావణి 500కు 477మార్కులు, ఆవుల కీర్తికారెడ్డి 476, ఆరిశెట్టి సాధన 475 మార్కులు సాధించారు.

సీహెచ్‌ఓల వినూత్న నిరసన


నినాదాలు చేస్తున్న సీహెచ్‌ఓలు

తిరుపతి తుడా : మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సీహెచ్‌ఓ) మోకాళ్లపై నిలబడి వినూత్నంగా నిరసన తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం సమీపంలో సీహెచ్‌ఓలు చేపట్టిన సమ్మె 14వ రోజుకు చేరింది. వారు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్హెచ్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేపట్టాలని, ఈపీఎఫ్‌ఓను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించకుంటే విధులకు హాజరయ్యే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. కనీస బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

అన్నప్రసాద కేంద్రం తనిఖీ


వంటల తయారీని పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్

తిరుమల: తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, లడ్డూ కౌంటర్లలో టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అన్నప్రసాద భవనంలో వంటల తయారీ, శుభ్రతను పరిశీలించారు. అన్నప్రసాదం నాణ్యతపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లడ్డూ కౌంటర్లను సందర్శించారు. లడ్డూల నాణ్యత, పరిమాణం, రుచిపై భక్తులను ఆరా తీశారు. అన్నప్రసాదం డిప్యూటీ ఈఓ రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆందోళన


ధర్నాలో ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులను వేధించడం అధికారులు మానుకోవాలని ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయుడు డిమాండ్ చేశారు. చలో డీపీటీఓ (జిల్లా ప్రజా రవాణా అధికారి) కార్యాలయం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలోని అన్ని డిపోలకు చెందిన ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు తిరుపతి డీపీటీఓ కార్యాలయానికి చేరుకుని ధర్నా నిర్వహించారు.. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీకి తమ సమస్యలపై అనేక పర్యాయాలు వినతులు సమర్పించామని, ఆయన స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా 2019 సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. అక్రమ సస్పెన్షన్లు నిలుపుదల చేయాలని స్పష్టం చేశారు. మహిళా ఉద్యోగులకు జీఓ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి జీవీ భాస్కర్ మాట్లాడుతూ ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నైట్ అలవెన్స్‌లు రూ.150 నుంచి రూ.400లకు పెంచాలని కోరారు. ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలని, గ్యారేజ్‌లో మెకానిక్స్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ జిల్లా అధ్యక్షులు పెరుమాళ్, కార్యదర్శి బీఎస్ బాబు, నేతలు అహ్మద్,ఆర్ముగం,డీవీఆర్ కుమార్, గుణశేఖర్, సతీష్,శ్రావణ్, డీహెచ్ కుమార్, తాళ్ల మోహన్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'వీసీఐ' బృందం పర్యటన

తిరుపతి సిటీ : తిరుపతి ఎస్వీ వెటర్నరీ కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ)బృందం బుధవారం నుంచి మూడు రోజులపాటు పర్యటించనుంది. కళాశాల సీబీఎస్‌ఈలోని సౌకర్యాలు, సిబ్బంది పనితీరును బృందం పరిశీలించనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య మంగళవారం తెలిపారు. బృందంలో భారతీయ వెటర్నరీ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తంగవేలు, మహారాష్ట్రలోని అకోలా నుంచి మైక్రో బయాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్పీ అవంద్కర్ ఉన్నారని వివరించారు.

మట్టి తవ్వితే సహించం


గ్రామస్తులు అడ్డుకున్న టిప్పర్లు

తిరుపతి రూరల్ : మండలంలోని దుర్గసముద్రం సమీపంలోని గుట్టపై అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న వారిని గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. గుట్ట వద్ద జేసీబీలు, టిప్పర్లను అడ్డుకుని నిరసన తెలిపారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి వెళ్లిన అధికారులు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత వాటిని వదిలేసినట్లు తెలియడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్కులు ఇకపై మట్టి తవ్వితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆర్ఐ, వీఆర్‌ఓ నిర్వాకంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సంతృప్తికరంగా సర్వే


పిల్లలతో మాట్లాడుతున్న అధికారులు

చంద్రగిరి : ప్రత్యేక అవసరాలు గల బడిఈడు పిల్లల కోసం నిర్వహిస్తున్న సర్వేపై ఐఈఆర్‌టీ జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం చంద్రగిరిలోని బ్రాహ్మణ వీధి, జమండ్లవీధి, చర్చివీధి, దర్శి వీధిలో చేపట్టిన సర్వేను ఎంఈఓ–2 భాస్కర్‌బాబుతో కలిసి పరిశీలించారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక విద్యను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు, వివిధ అలవెన్సులను సమగ్రశిక్ష ద్వారా అందిస్తున్నామని వివరించారు. ప్రత్యేక అవసరాల గల బడిఈడు పిల్లలు ఉంటే చంద్రగిరిలోని బాలికల పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రానికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు వెంకట రాజేశ్వరి శ్యామలదేవి పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

తిరుపతి క్రైమ్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని మంగళవారం అలిపిరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. బంతాలమ్మ గుడి వద్ద గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు శ్రీకాళహస్తికి చెందిన షేక్ మహబూబ్ బాషా, కేవీబీపురానికి చెందిన కంచి చైతన్య, తిరుపతి జీవకోనకు చెందిన సాయి ప్రతాప్ రెడ్డి, తిరుపతి రూరల్ మండలానికి చెందిన జోసెఫ్‌గా గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక కవి అన్నమయ్య


మాట్లాడుతున్న ఆచార్య సర్వోత్తమరావు

తిరుపతి కల్చరల్ : సామాజిక కవిగా అన్నమయ్య సాహిత్యం విలక్షణమని ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు కె.సర్వోత్తమరావు కొనియాడారు. అన్నమాచార్య కళామందిరంలో నిర్వహిస్తున్న అన్నమయ్య 617వ జయంత్యుత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు ఆచార్య సర్వోత్తమరావు అధ్యక్షత వహించి 'అన్నమయ్య పదాలలో గ్రామీణ చిత్రణ' అనే అంశంపై ప్రసంగించారు. అన్నమయ్య తన సంకీర్తనల్లో గ్రామీణ జీవితంలోని మాధుర్యం, జానపదాలు, సామెతలు, నానుడులను పొందుపరిచారని వివరించారు. సమాజ వికాసానికి అన్నమయ్య కీర్తనలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. అన్నమయ్య వంశీయుడు హరిహరనారాయణాచార్యులు 'శ్రీవారి ఆలయం అన్నమయ్య సేవా కైంకర్యాలు' అనే అంశంపై ప్రసంగించారు. బాల్యం నుంచి శ్రీవారి పరమ భక్తుడు అన్నమయ్య అని తెలిపారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ బత్తెల శ్రీరాములు 'అన్నమయ్య సంకీర్తనలు వైష్ణవాచార్యులు' అనే అంశంపై ప్రసంగించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ మేడసాని మోహన్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ లత పాల్గొన్నారు. బుల్లెమ్మ బృందం గాత్ర సంగీతం, పురుషోత్తం బృందం ప్రదర్శించిన హరికథాగానం భక్తులను ఆకట్టుకుంది. మహతి కళాక్షేత్రంలో మధుసూదన్‌రావు బృందం ప్రదర్శించిన గాత్ర కచేరీ మధురంగా సాగింది.

నోరు జారితే సహించం

- చెవిరెడ్డి పేరెత్తే అర్హతే ఈశ్వరరెడ్డికి లేదు
- ఊరి కోసం జైలుకైనా సిద్ధం
- టీడీపీ మండలాధ్యక్షుడిపై మహిళల ఆగ్రహం


మీడియా సమావేశంలో తుమ్మలగుంట మహిళలు

తిరుపతి రూరల్ : ''అయ్యా ఈశ్వర్ రెడ్డి.. నీకు తుమ్మలగుంటతో ఎలాంటి సంబంధం లేదు.. మా ఊరి గురించి మాట్లాడటానికి ఎవరు నువ్వు..? మా గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేరెత్తే అర్హతే నీకు లేదు. నోరు జారితే సహించే ప్రసక్తే లేదు. ప్రభుత్వ భూములు కొట్టేసిన నువ్వు కూడా నీతులు చెబుతున్నావా'' అంటూ తుమ్మలగుంట గ్రామానికి చెందిన మహిళలు మండిపడ్డారు. టీడీపీ తిరుపతి రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గ్రామ రచ్చబండ వద్ద మహిళలు మీడియాతో మాట్లాడారు.

జెడ్పీటీసీ సభ్యుడిగా, తుడా చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి స్వగ్రామాన్ని అభివృద్ధి పథకంలో నడిపించారన్నారు. ఎవరు పడితే వాళ్లు వచ్చి చెవిరెడ్డి చేసిన అభివృద్ధిని చెరిపేస్తాం అంటే ఇక్కడ కుదరదని స్పష్టం చేశారు. ఊరు కోసం జైలు కెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు.

పార్కు మా గ్రామ ఆస్తి

తుమ్మలగుంటలోని కేవీఎస్ పార్క్ మా గ్రామ ఆస్తి.. ఈశ్వర్‌రెడ్డి ఊరు పెరుమాళ్లపల్లెవాసులు కూడా ఇక్కడ నిత్యం వాకింగ్ చేస్తున్నారని తెలిపారు. చేతనైతే వాళ్ల గ్రామంలో అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. అధికారం ఉంది కదాని చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఎవరేమన్నారంటే..

మా ఊరి హక్కు



కేవీఎస్ పార్కు మా ఊరి హక్కు. మా పంచాయతీ ఆస్తి. అక్రకమంగా తుడాకు అప్పగించి నాశనం చేస్తామంటే ఊరుకోం. తుమ్మలగుంట వాసుల అనుమతి లేకుండా ఎలాంటి చర్యలు చేపట్టినా సహించే ప్రసక్తే లేదు. చెవిరెడ్డి చేసిన అభివృద్ధిని చెరిపేయాలనుకోవడం అనుచితం.
– రత్నమ్మ, జెడ్పీటీసీ సభ్యులు, తిరుపతి రూరల్.

నాశనం చేస్తారా..?



కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాదవుతోంది.తుమ్మలగుంటలో ఒక్క పని చేయలేదు. కానీ ఇక్కడి అభివృద్ధి పనులను నాశనం చేసేందుకు యత్నిస్తున్నారు. కేవీఎస్ పార్కులో ఎంతో మంది క్రీడాకారులు తమ ప్రతిభకు మెరుగులు దిద్దుకుంటున్నారు. ఆ పార్కును చెవిరెడ్డి ఇంట్లో పెట్టుకోలేదు.
– బుజ్జమ్మ, ఎంపీటీసీ సభ్యులు, తుమ్మలగుంట

నీ స్థాయి తెలుసుకో..



నీ స్థాయి తెలుసుకో ఈశ్వర్‌రెడ్డి. మా తుమ్మలగుంట గురించి మాట్లాడే హక్కు నీకు ఎవరు ఇచ్చారు. చెవిరెడ్డి అన్నపై నోరు జారితే మాములుగా ఉండదు. కబ్జాదారులకు మాట్లాడే అర్హత లేదు. – గీతమ్మ, తుమ్మలగుంట

మా ఊరు స్థలం అంది



మా గ్రామంలో చేసిన అభివృద్ధి పనులన్నీ మాఊరుకే దక్కుతాయి. తుడా నిధులతో అభివృద్ధి చేస్తే.. పార్కును వారికే అప్పగించాలా. పంచాయతీ నిర్వహణలోని పార్కును మళ్లీ తీసేసుకుంటామంటే కుదరదు. – సుచరిత, తుమ్మలగుంట

పంచాయతీకే హక్కు



తుమ్మలగుంటలో ఉన్న గ్రౌండ్ మా ఆస్తి, మాపంచాయతీకే హక్కు. ఎన్నో గ్రామాలలో పార్కులు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుంటున్నారా. కేవలం టీడీపీ నేతలకు మా కేవీఎస్ పార్క్, గోవింద ధామం, అంబేద్కర్ కాంప్లెక్స్ పైనే కన్ను. – సునీత, తుమ్మలగుంట

మా పన్నులతో కట్టారు



తుమ్మలగుంట కేవిస్ పార్కు గురించి మాట్లాడే అర్హత టీడీపీ నేతలకు లేదు. అది మా ఊరి వాళ్లందరం తుడాకు చెల్లించిన పన్నులతో కట్టారు. మా బిడ్డలను ఈ రోజు ఆ పార్కులో చక్కగా ఆడుకుంటున్నారు. దీన్ని లాక్కుంటే ఊరుకోం. – సుజాత, తుమ్మలగుంట